సాక్షి అనకాపల్లి

ఆదివారం। 16 । మార్చి । 2025



జో అచ్యుతానంద.. 8లో

ఉపమాకలో పుష్పయాగోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉభయ దేవేరులతో స్వామిని ఉయ్యాలలో ఉంచి పవళింపు సేవ నిర్వహించారు.



గ్లకోమాపై అవగాహన

తాటిచెట్లపాలెం: గ్లకోమా నుంచి కళ్లను రక్షించుకోవాలని వైద్యులు తెలిపారు. అవగాహన కోసం విశాఖలో ర్యాలీ జరిపారు.



న్యూస్‌రీల్

నూకాంబిక దేవస్థానం ఈవోగా రాంబాబు బాధ్యతల స్వీకారం



అనకాపల్లి టౌన్: నూకాంబిక దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వెంపలి రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కనకమహాలక్ష్మి ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఉన్న రాంబాబును ఇటీవలే సింహాచలం బదిలీ చేశారు. ఇంతలో ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి రావడంతో నూకాంబిక దేవస్థానం ఈవోగా నియమించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈ నెలలో జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.44.66 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, శ్రీవారి సేవా సభ్యులు

అనకాపల్లి టౌన్: నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు దేవస్థానం ఉత్సవ మండపం ఆవరణలో శనివారం జరిగింది. గత ఏడాది అక్టోబర్ 28వ తేదీ నుంచి శనివారం వరకు 138 రోజులలో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను లెక్కించారు. రూ.44,65,787 నగదు, 20.500 మిల్లీగ్రాముల బంగారం, కేజీ 925 గ్రాముల వెండి హుండీల ద్వారా వచ్చినట్లు ఎండోమెంట్ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏసీ సుధారాణి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, శ్రీవారి సేవ సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు తగదు

అనకాపల్లి టౌన్: జిల్లాలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ఫార్మా, ఇతర రసాయన పరిశ్రమల ప్రమాదాలతో అల్లాడుతున్న జిల్లాలో ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. అమెరికాలోని త్రిమెన్ ఐలాండ్, రష్యాలోని చెర్నోబిల్, జపాన్‌లోని పుకూషిమాలో చోటు చేసుకున్న అణు ప్రమాదాలు ఎంతటి ప్రమాదకరమో స్పష్టం చేశాయన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో అణు విద్యుత్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నామని, జిల్లాలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా పోరాటాలతో అడ్డుకుంటామన్నారు.



- ఇద్దరు కాంట్రాక్టర్లకు నామినేషన్ పనులు
- 'ప్రణ'మిల్లి పనులు అప్పగిస్తున్న ఓ ఇంజనీర్
- యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కోసం అత్యుత్సాహం
- ఉన్నతాధికారి ద్వారా పనికానిచ్చేందుకు ఒత్తిళ్లు
- చినబాబుకు మంచిగా చెబుతానంటూ మస్కా

మాయాగోపాలం!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఒక వైపు ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగులకు, సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న కూటమి ప్రభుత్వం... మరోవైపు అక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహారాలు నడిపేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్హత లేని వ్యక్తికి యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కట్టబెట్టేందుకు మాయా'గోపాల' వ్యవహారం మొదలైంది. తాను చెప్పిన ఇద్దరు వ్యక్తులు చినబాబుకు దగ్గరని.. వారికి పనులు దక్కేలా చూడాలంటూ యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టును ఆశిస్తున్న ఇంజనీర్‌కి.. అర్హతకు మించి పోస్టు దక్కించుకున్న ఓ చోటా నేత ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తోంది. ఇందుకు జీ హుజూర్ అంటూ సదరు ఇంజనీర్ కూడా 'ప్రణ'మిల్లి టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై అప్పగిస్తున్నట్టు సమాచారం. మరోవైపు సదరు ఇంజనీర్‌కే యూనివర్సిటీ ఇంజనీర్ (యూఈ) పోస్టు దక్కేలా చూడాలంటూ యూనివర్సిటీలోని ఓ అధికారికి కూడా సదరు చోటా నేత ఆదేశించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా తాను చినబాబుకు ఎంత దగ్గరో మీకు తెలుసంటూ... మీ గురించి మంచిగా చెబుతానంటూ వల వేసినట్టు ప్రచారం జరుగుతోంది. అనుకున్నట్టుగానే సదరు అధికారి కూడా ఫలానా వ్యక్తికే యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఇవ్వాలంటూ అనధికారికంగా ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా రికార్డులను కూడా సెట్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటివరకు ఈ విధంగా రూ.50 లక్షల మేర పనులను నామినేషన్‌పై సదరు చోటా నేత సూచించిన ఇద్దరు వ్యక్తులకే కేటాయించినట్టు తెలుస్తోంది. వీరి నుంచి తనకు రావాల్సిన 10 శాతం పర్సంటేజీని వసూలు చేసుకుంటున్నట్టు సమాచారం. మొత్తంగా సదరు చోటా నేత యూనివర్సిటీలో బడా వ్యవహారాలు చక్కాగా నడుపుతున్నారు.

చినబాబుకు దగ్గరంటూ...!

వాస్తవానికి ఊహించని రీతిలో నామినేషన్ పదవిని దక్కించుకున్న సదరు చోటా నేత... తనకు చినబాబు దగ్గర కావడంతోనే పదవి వచ్చిందంటూ చెప్పుకుంటున్నారు. చినబాబు టూర్‌లోనూ హడావుడి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో సదరు నేత సిఫార్సు చేసిన ఇద్దరు కాంట్రాక్టర్లు కూడా చినబాబుకు దగ్గరంటూ యూనివర్సిటీ అధికారులకు చెబుతున్నారు. వారికి ఇప్పటికే నామినేషన్ పనులను అప్పగిస్తున్నారు. అంతేకాకుండా టెండర్ వ్యవహారాల్లో కూడా ఈ ఇద్దరు కాంట్రాక్టర్లకే దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఇందుకోసం ఓ ఇంజనీర్‌ను బుట్టలో వేసుకున్నట్టు తెలుస్తోంది. సదరు ఇంజనీర్ కూడా యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టును ఆశిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న సదరు మాయా 'గోపాలుడు' ఆ పోస్టు ఇప్పిస్తానంటూ చెబుతున్నట్టు సమాచారం. ఇందుకోసం యూనివర్సిటీలోని ఒక అధికారి ద్వారా సిఫార్సు కూడా చేయిస్తున్నట్టు తెలుస్తోంది. సదరు అధికారికి కూడా చినబాబు పేరుతో మస్కా కొట్టినట్టు యూనివర్సిటీలో చర్చ నడుస్తోంది. 'మీ గురించి చినబాబుకు మంచిగా చెబుతానంటూ సదరు అధికారికి వల వేశారు'.. ఇందులో భాగంగా సదరు అధికారి కూడా సదరు చోటా నేత సిఫార్సు చేసిన ఇంజనీర్‌కే యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఇవ్వాలంటూ అర్హత లేకపోయినప్పటికీ ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం రికార్డులను కూడా ఏమారుస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు కోసం..!

యూనివర్సిటీ ఇంజనీర్ పోస్టు ఆశిస్తున్న ఓ ఇంజనీర్.. సదరు చోటా నేతకు 'ప్రణ'మిల్లి మరీ అర్హత లేకపోయినా నామినేషన్ పద్ధతిలో పనులను అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు పనులను నామినేషన్‌పై అప్పగించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా తాను యూనివర్సిటీ ఇంజనీర్‌గా పూర్తి స్థాయిలో నియమితులైతే... యూనివర్సిటీలో చేపట్టే పనుల్లో మెజార్టీ వాటా వీరికే వచ్చేలా చేస్తానని కూడా హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం నియమించిన కమిటీ సభ్యులకు కూడా సదరు వ్యక్తికే యూనివర్సిటీ ఇంజనీరు పోస్టు వచ్చేలా చూడాలంటూ వర్సిటీలోని ఓ అధికారి అనధికారికంగా సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నారు. చినబాబుకు చెప్పి.. తన పోస్టుకు ఎసరు రాకుండా చూస్తారనే ఆశతో యూనివర్సిటీ అధికారి కూడా సదరు చోటా నేత చెప్పినట్టు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- పరీక్ష కేంద్రాల్లో సకల సౌకర్యాలు
- రేపటి నుంచి 31 వరకు నిర్వహణ



సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం107 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 17న ప్రారంభమై 31వ తేదీతో ముగుస్తాయి. 31వ తేదీ రంజాన్ సెలవు ప్రకటిస్తే.. ఆ రోజు జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ 1వ తేదీన నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష సమయం. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్ష సమయం ముగిసేవరకు విద్యార్థులు బయటకు రాకూడదు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు గానీ, సెల్‌ఫోన్లు గానీ, స్మార్ట్ వాచీలు గానీ అనుమతించరు. మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలందాయి. టెన్త్ విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా అన్ని చర్యలు తీసుకున్నారు. విద్యార్థి హాల్‌టికెట్ చూపిస్తే చాలు.. టిక్కెట్ లేకుండానే ప్రయాణించవచ్చు.

పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్‌లు

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుతున్నారు. తాగునీటి సౌకర్యం, పరీక్ష గదిలో ఫ్యాన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టేబుళ్లు, మరుగుదొడ్లు తదితర వసతులు అందుబాటులో ఉన్న పరీక్ష కేంద్రాలనే ఎంపిక చేశారు.

జిల్లాలో పరీక్ష కేంద్రాలు	107
హాజరుకానున్న విద్యార్థులు	22,042
బాలికలు 10,968, బాలురు	11,074
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు	17,142
ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు	4,900
సప్లిమెంటరీ పరీక్షార్థులు	1258
ఓపెన్ స్కూల్ విద్యార్థులు	664
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	7

ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాటు పూర్తిచేశాం. విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ఉచితంగా పరీక్ష కేంద్రానికి చేరుకోవచ్చు. వారికి అందుబాటులో ఉండేలా స్టాప్‌లు ఏర్పాటు చేయాలని ప్రజారవాణా శాఖ వారిని కోరాం. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి సదుపాయం కల్పించి, పరీక్ష గదుల్లో ఫ్యాన్లు పనిచేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వెలుతురు బాగా ఉన్న గదులను ఎంపిక చేశాం.

– అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

ఆఫ్‌లైన్‌లో టికెట్లు లేనట్టేనా?

- 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో డీసీ ఢీ
- ఆన్‌లైన్‌లోనే టికెట్ల విక్రయాలు

విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆడనున్న తొలి ఐపీఎల్ మ్యాచ్‌కు ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం లేనట్టేనా? ఇటీవల ఏసీఏ నిర్వహించిన సమావేశంలో ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్లు విక్రయిస్తామని ప్రకటించినప్పటికీ, అందుకు తగ్గట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) బృందం ఏర్పాట్లు చేయకపోవడంతో కౌంటర్ల ద్వారా టికెట్ల విక్రయం లేదని తెలిసింది. దీంతో ఆఫ్‌లైన్ టికెట్ల కోసం వేచి చూస్తున్న క్రీడాభిమానులు నిరాశ చెందుతున్నారు. ఈ నెల 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో డీసీ తలపడనుంది. ఇరు జట్లకు ఈ సీజన్‌లో మొదటి మ్యాచ్ కావడంతో ముందుగానే విశాఖ చేరుకోనున్నాయి. కాగా.. ఈ నెల 13న రాత్రి 8 గంటల నుంచి ఆన్‌లైన్‌లో డీసీ టికెట్లను విక్రయించడం ప్రారంభించింది. ప్రస్తుతం తక్కువ ధరల్లో టికెట్లు అందుబాటులో లేవు. రూ.2,200, రూ.2,500, రూ.3,000, రూ.3,500, అత్యధికంగా రూ.5,000 విలువ గల టికెట్లు ఖాళీలే కనిపిస్తున్నాయి. మొత్తంగా 27,251 సీటింగ్ సామర్థ్యం కలిగిన ఈ స్టేడియంలో 18 కార్పొరేట్ సూట్‌లు, 16 కార్పొరేట్ బాక్స్‌లు ఉన్నాయి. ప్రేక్షకుల కోసం 22 స్టాండ్స్ అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారు వాటిని ఫిజికల్ టికెట్లుగా మార్చుకోవడానికి నగరంలో మున్సిపల్ స్టేడియం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్ వద్ద ఏసీఏ సహకారంతో డీసీ కౌంటర్లు ఏర్పాట్లు చేస్తోంది. మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు వరకు ఆన్‌లైన్ టికెట్లను ఫిజికల్ టికెట్లుగా మార్చుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఐపీఎల్ నేపథ్యంలో వైఎస్సార్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ పెద్ద సవాలు

- దుకాణదారులు పాలిథిన్ కవర్లు విక్రయించరాదు
- వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని స్పీకర్ ఆదేశం



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



నర్సీపట్నంలో అధికారులు, ప్రజలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ప్లాస్టిక్ వినియోగాన్ని పకడ్బందీగా కట్టడి చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ పర్యావరణానికి పెద్ద సవాలుగా పరిణమించిందన్నారు. నర్సీపట్నంలో ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ కవర్లు విక్రయించవద్దని నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్రను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఆదేశాలు బేఖాతరు చేస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించాలన్నారు. ఇటీవల కాలంలో నర్సీపట్నంలో నాటు వైద్యులు పెరిగారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కొంతమంది డాక్టర్లు మత్తు ఇంజక్షన్లు కూడా ఇవ్వకుండా ఆపరేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో రూ.14.11 కోట్లతో త్వరలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులు అందజేస్తామన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ రామారావు, కౌన్సిలర్లు సిహెచ్.పద్మావతి, రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అచ్యుతాపురం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం కాపాడుకోగలమని కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెలుపాక జగన్నాథపురంలో పర్యటించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. జేసీ జాహ్నవి, ఆర్డీవో, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- ఆత్రుతగా ఎదురుచూస్తున్న అర్హులు
- కూటమి ప్రభుత్వం 9 నెలల్లో ఒక్కరికైనా కొత్తగా పెన్షన్ ఇచ్చిందా?
- నిలదీసిన జెడ్పీటీసీ సభ్యులు
- మన్యంలో చిన్నారుల మృత్యు ఘోషపై వాడీవేడి చర్చ
- గరంగరంగా జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కొత్త పింఛన్లు ఎప్పుడు?



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘాల సమావేశాలు



హాజరైన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తదితర సభ్యులు, అధికారులు

మహారాణిపేట (విశాఖ): కూటమి ప్రభుత్వంలో కొత్తగా పింఛన్లు మంజూరు కాకపోవడంపై పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పింఛన్లు తీసుకుంటూ చనిపోయిన వారి కుటుంబ సభ్యుల్లో అర్హులుంటే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారని, దరఖాస్తు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన పలు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడుతూ పింఛన్లు తీసుకుంటూ చనిపోయిన కుటుంబ సభ్యులకు పింఛన్లు ఇస్తామని ప్రకటించారని, కానీ జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అలాగే అర్హులకు పింఛన్లు ఇస్తామని చెప్పారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా ఎక్కడా కొత్త పింఛన్లు ఇవ్వలేదని, ఇది అన్యాయమన్నారు.

ఏజెన్సీలో పిల్లల మృతిపై ఆందోళన

ఏజెన్సీలో వైద్య సదుపాయాలపై, పిల్లల మరణాలపై చర్చ జరిగింది. తొలుత అరకు జెడ్పీటీసీ చెట్టి రోష్ని మాట్లాడుతూ అరకు మండలం బస్కి గ్రామంలో పిల్లలు ఆకస్మికంగా మృతి చెందారని, ఈ విషయం గురించి మాట్లాడడానికి తాను హెల్త్ సబ్ సెంటర్‌కు కాల్ చేసినా ఎవరూ ఫోన్ ఎత్తడం లేదన్నారు. గిన్నెల, మాడగూడ తదితర ప్రాంతాల్లో చిన్న పిల్లలు వరుసగా చనిపోయారని, కారణం తెలియక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరణ ఇవ్వాలని చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఒక్క అధికారి కూడా రాలేదని, జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలకు రాని అధికారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆమె సీఈవోను కోరారు.

జెడ్పీటీసీలను పట్టించుకోని హౌసింగ్ అధికారులు

హౌసింగ్ అధికారులు జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులను పట్టించుకోవడం లేదని పలువురు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. తమ మండలాల్లో గృహ నిర్మాణ అధికారులు సర్వే చేస్తున్న సమయంలో, కొత్త పేర్ల నమోదు చేసేటప్పుడు తమను సంప్రదించడం లేదని, దీనివల్ల స్థానికంగా తాము ఇబ్బంది పడుతున్నామని, గతంలో ఎప్పుడూ ఇలా లేదని వారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకొని వస్తామని అధికారులు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల డ్రాపవుట్స్ పెరుగుతున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మహిళా స్థాయీ సంఘం చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ కోరారు. పాయరావుపేట నుంచి అనకాపల్లి వరకు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, అందువల్ల అనకాపల్లిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోమ సత్యనారాయణ కోరారు. అనకాపల్లి నుంచి మామిడిపాలెం వెళ్లే రహదారిలో నాణ్యత లోపించిందని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ ఆరోపించారు. ఈ పనులకు రూ.30 లక్షల మేరకు నిధులు ఖర్చయినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని, గుంతల్లో డస్ట్‌తో పూడ్చడం వలన నాణ్యత లోపించిందని అన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు కనిపించలేదా..!



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి

కోటవురట్ల మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి ధ్వజమెత్తారు. వరాహనదిలో పైలట్ ప్రాజెక్టు సమీపంలోనే అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటితే నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు సంబంధించి 36 గ్రామాలకు తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తోపాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర



కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో సత్యనారాయణ, ఇతర అధికారులు

తుమ్మపాల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శనివారం డీఆర్వో సత్యనారాయణ, పరిపాలన విభాగం సిబ్బందితో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని తొలగించారు. అందరూ కలిసి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సూపరింటెండెంట్ రాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వండి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు వెంకన్న, నరసింహమూర్తితో ఆదివాసీ గిరి రైతులు

మాడుగుల : మైదాన ఆదివాసీ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములుకు పట్టాలివ్వాలని, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న అన్నారు. శనివారం శంకరం పంచాయితీలో కృష్ణంపాలెం, బొడ్డరేవు, మామిడిపాలెం, తాడివలస, గొప్పూరు, వెలగలపాడు గిరిజన గ్రామాల్లో సీపీఎం పాదయాత్ర నిర్వహించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది గిరిజనులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నా సరే వాటిలో పేర్లు తప్పుగా నమోదు జరిగిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గిరిజనుల భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి, సీపీఎం సభ్యులు, కార్లి భవానీ, రైతులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘనంగా నివాళులు

నర్సీపట్నం: బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బహుజన ఐక్యవేదిక నాయకులు బొట్టా నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి సుమారు 78 ఏళ్లు కావస్తున్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికార కాంక్ష ఫలించలేదన్నారు. ఈ అట్టడుగు వర్గాల వారికి రాజ్యాధికారం కోసం కాన్షీరాం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

అచ్యుతాపురం రూరల్ : పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మేరుగు జగన్ (20) శుక్రవారం రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం సముద్ర ప్రాంతంలో గల్లంతయ్యాడు. శనివారం పూడిమడక తంతడి మధ్యలో అతని మృతదేహం తీరానికి కొట్టుకు వచ్చింది. మృతదేహానికి పోలీసులు పోస్టు మార్టం నిర్వహింపజేసి కుటుంబీకులకు అప్పగించారు. జగన్ మృతదేహం వద్ద కుటుంబీకులు బోరున విలపించారు.

జో అచ్యుతానంద.. జోజో ముకుందా..

- వెంకన్న పవళింపు సేవలో పాల్గొని తరించిన భక్తజనం
- ఉపమాకలో పుష్పయాగోత్సవాలు ప్రారంభం



పుష్ప యాగోత్సవంలో భాగంగా ద్వాదశ తిరువారాధన

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల అనంతరం మూడు రోజుల పాటు జరిగే పుష్పయాగోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తులను ముందుగానే అలంకరించిన అద్దాల మండపంలో గల ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, పాలు నివేదనలు చేసి భక్తుల సమక్షంలో విశేష నీరాజనాలు సమర్పించారు. శ్రీవైష్ణవ స్వాములకు తాంబూలాలు అందజేసి నీరాట్టం సేవాకాలంలో స్వామివారికి పుష్పయాగోత్సవం (పవళింపు సేవ) మొదటిరోజు కార్యక్రమం పూర్తి చేశారు. అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం

శుక్రవారం రాత్రి స్వామివారి డోలోత్సవం (అద్దపు సేవ) కన్నుల పండువగా జరిగింది. మధ్యాహ్నం స్వామివారికి రాజయ్యపేట సముద్రతీరంలో అవబృందం కార్యక్రమం నిర్వహించారు. సముద్ర జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి రాత్రి రథోత్సవం జరిపారు. తదుపరి ఆలయానికి తీసుకువచ్చి అద్దపుసేవ నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారు కొత్త కళతో వెలిగిపోతూ ఉంటారు. నేరుగా చూస్తే భక్తులకు దృష్టి దోషం కలుగుతుందనే ఉద్దేశంతో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని ఊయలలో ఉంచి అద్దంలో చూపిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని అద్దంలో చూసి పరవశులయ్యారు. అనంతరం మాడవీధుల్లో తిరువీధి సేవ (దొంగల దోపు ఉత్సవం) నిర్వహించారు. తదుపరి ఆస్థాన మండపంలో లక్ష్మీ సంవాద కార్యక్రమం జరిగింది. దీంతో స్వామివారికి ఐదు రోజులపాటు నిర్వహించిన కల్యాణోత్సవాలు పరిసమాప్తమయ్యాయని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

వడ్డాదిలో వేడుకగా పుష్పాంజలి



వడ్డాది వెంకన్నకు పుష్పాంజలి సేవ

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి 152వ కల్యాణ మహోత్సవాలు ముగిశాయి. కల్యాణ వేడుకల్లో ఆఖరి రోజు వేంకటేశ్వర స్వామికి ఇష్టమైన శనివారం రావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయ మండపంలో ప్రత్యేకంగా తయారు చేసిన ఊయలలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి జోలపాటలతో పుష్పాంజలి (పవళింపు) సేవ చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని బుగ్గన పెళ్లి చుక్కతో శ్రీదేవి, భూదేవి నడుమ ఇమిడిపోయిన వేంకటేశ్వరస్వామి అందాన్ని చూసి పరవశించిపోయారు.

ఛలోక్తులతో కూడిన జోల పాటలు, భక్తి గీతాలు పాడుతూ ఉత్సాహంగా ఊయల సేవ చేశారు. పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు స్వామికి జోల పాడేందుకు పోటీ పడ్డారు. రాత్రికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

సబ్బవరంలో ఇసుక స్టాక్ యార్డ్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాలోని ఇసుకరీచ్‌ల నుండి ఇసుకను జిల్లాలోని సబ్బవరం మండలంలో నిల్వ కేంద్రం వద్దకు రవాణా, నిల్వ చేసి, నిల్వ కేంద్రం నుండి వాహనాల్లో లోడ్ చేయడానికి లాటరీ పద్ధతిన దరఖాస్తులు కోరతున్నట్టు కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ చైర్‌పర్సన్ విజయకృష్ణన్ తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున తక్కువ మొత్తంలో ఇసుక కావలసిన వినియోగదారులు ఇసుక డిపో ద్వారా ఇసుక సరఫరా చేయు నిమిత్తం ప్రైవేట్ వ్యక్తులకు మినరల్ డీలరు లైసెన్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. టన్ను అమ్మకం ధర రూ.958 ప్రకారం అమ్మకాలు జరపడానికి, వాహనాలు వచ్చి వెళ్లడానికి సరైన మార్గం గల ప్రైవేట్ స్థలం 4 ఎకరాలు (లీజు, సొంతం) కలిగి ఉన్న వ్యక్తులు మినరల్ డీలరు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం వారి విధి విధానాలకు లోబడి పైన పేర్కొన్న ధరకు మాత్రమే ఇసుకను విక్రయించాలని, స్టాక్ యార్డ్‌లు ఏర్పాటు చేయడానికి రెండేళ్ల ఇసుక యార్డ్ నిర్వహణ అనుభవం కలిగిన ఆసక్తి గల వ్యక్తులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారికి ఫోన్ 9100688822ను సంప్రదించాలన్నారు.

నాందేడ్, ఎల్టీటీ, షిర్డీ రైళ్ల రూట్ మార్పు

- సికింద్రాబాద్‌కు రాకపోకలు బంద్
- కొత్తగా చర్లపల్లిలో హాల్ట్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లను సికింద్రాబాద్ మీదుగా కాకుండా.. చర్లపల్లి మీదుగా నడిచే విధంగా మార్పులు చేశారు. ఈ మార్పులు శాశ్వతంగా వర్తిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు స్పష్టం చేశారు. కింద పేర్కొన్న రైళ్లకు కొత్తగా చర్లపల్లిలో హాల్ట్ ఇచ్చారని, ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని వారు కోరారు.

- విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 20 నుంచి, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 22 నుంచి మార్పు చేసిన మార్గంలో అంటే వయా చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్ మీదుగా నడుస్తాయి. ఆ రోజు నుంచి ఈ రైళ్లు మౌలాలి, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా ప్రయాణించవు.
- సంబల్‌పూర్–నాందేడ్ (20809) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి మార్పు చేసిన మార్గంలో వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు ఆయా తేదీల నుంచి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.
- విశాఖపట్నం–నాందేడ్ (20811) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి, నాందేడ్–విశాఖపట్నం (20812) ట్రై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుంచి వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.
- విశాఖపట్నం–సాయినగర్ షిర్డీ (18503) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24 నుంచి, సాయినగర్ షిర్డీ–విశాఖపట్నం (18504) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి వయా చర్లపల్లి–మౌలాలి జీ క్యాబిన్–దయానందనగర్ మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా ప్రయాణించవు.

ఆర్మీలో అగ్నివీర్ అవుతారా?

- అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు
- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు
- విశాఖలో మరోసారి ర్యాలీ
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి.

అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్'అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891-2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

జూపార్కులో రాప్టర్ల ప్రదర్శన ప్రారంభం

ఆరిలోవ: పర్యావరణ పరిరక్షణలో రాప్టర్ల(గెద్ద జాతి) పాత్ర ఎంతో కీలకమని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతిప్రియ అన్నారు. ఇందిరాగాంధీ జూ పార్కులో డబ్ల్యూడబ్ల్యూఎఫ్–ఇండియా వింగ్ ఆఫ్ వండర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రాప్టర్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి ప్రియ మాట్లాడుతూ రాప్టర్లు మాంసాహార పక్షులని, ఇవి ఎలుకలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. అంతేకాకుండా, చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగించడం ద్వారా పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచుతాయని వివరించారు. విద్యార్థులు రాప్టర్ల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. 90 రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో రాప్టర్ల చిత్రపటాలు, వాటికి సంబంధించిన సమాచార బోర్డులు ఏర్పాటు చేశారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్–ఇండియా వింగ్ ఆఫ్ వండర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాల్లో యూకలిప్టస్ తోటలు దగ్ధం



కెఎం.పాలెంలో మంటలు అదుపు చేస్తున్న చోడవరం అగ్నిమాపక శకటం సిబ్బంది



దిబ్బిడిలో కాలిపోతున్న సరుగుడు తోటలు

దేవరాపల్లి: కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 5 ఎకరాల మేర యూకలిప్టస్ తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సిరసపల్లి రాము, సిరసపల్లి దేముడమ్మ, సిరసపల్లి రాములమ్మ, చౌడువాడ లక్ష్మీ, చౌడువాడ అప్పలనర్స, చౌడువాడ అప్పలనాయుడు, బోను సింహాచలంనాయుడు, లక్కరాజు భూషణంకు చెందిన తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులంతా పొలం పనులకు వెళ్లిన సమయంలో కోళ్ల ఫారంకు ఎదురుగా ఉన్న యూకలిప్టస్ తోటల నుంచి మంటలు కనిపించడంతో స్థానికులు అక్కడుకు చేరుకున్నారు. అగ్ని కీలలు ఎగిసి పడడంతో మంటలను అదుపు చేయడం సాధ్యం కాలేదు. వెంటనే చోడవరం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి రప్పించామని, అప్పటికే తోటంతా కాలిపోయిందని స్థానిక సర్పంచ్ గంధం రామకృష్ణ తెలిపారు. మిగతా తోటలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది కృషి చేశారన్నారు. కాగా ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షలు విలువ చేసే తోటలు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

దిబ్బిడిలో ఆరు ఎకరాల్లో సరుగుడు తోట దగ్ధం

బుచ్చెయ్యపేట : దిబ్బిడి గ్రామంలో విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరు ఎకరాల్లో సరుగుడు తోటలు కాలిపోగా సుమారు రూ.నాలుగు లక్షలు ఆస్తి నష్టం జరిగింది. గ్రామంలో గల జర్తా వారి పొలాల్లో శనివారం విద్యుత్ వైర్లు కలిసిపోయి అగ్గినిప్పులు పడగా గాలికి రాజుకుని మంటలు వ్యాపించినట్టు బాధిత రైతులు తెలియజేస్తున్నారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ముమ్మిన నాగరాజు, పాతాళ శ్రీనివాసరావు, కందికొండ శ్రీను, సేనాపతి సూరిబాబు, దేవుడమ్మ,బోధ అమ్మాజీ, ముమ్మిన నూకరాజులకు చెందిన సరుగుడు తోటలు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మూడేళ్ల సరుగుడు తోటలు కాలిపోవడంతో రూ.4 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

నేల నుంచి నీటిలోకి..

సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు



తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెడుతున్న డీఎఫ్‌వో శ్రీవాణి

కొమ్మాది: బుల్లి ఆలివ్ రిడ్లే తాబేళ్లు బుడిబుడి అడుగులు వేసుకుంటూ తమ సహజ ఆవాసమైన సముద్రంలోకి చేరుకున్నాయి. ఈ మనోహరమైన దృశ్యం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. జోడుగుళ్లపాలెం, చేపలుప్పాడ, పెద నాగమయపాలెం ప్రాంతాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెట్టిన గుడ్లను అటవీ శాఖ అధికారులు సేకరించి సాగర్‌నగర్‌లోని తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో సంరక్షించారు. వీటి నుంచి వచ్చిన పిల్లలను డీఎఫ్‌వో శ్రీవాణి శనివారం సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోడుగుళ్లపాలెం నుంచి పెదనాగమయపాలెం వరకు మొత్తం 57,372 గుడ్లను సేకరించి సంరక్షించినట్లు తెలిపారు. తొలి దశలో శనివారం ఉదయం 237 తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లోనూ విడతల వారీగా మరిన్ని తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



పామును పట్టుకున్న కిరణ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–11లో 111 క్వార్టర్స్‌లో నాగుపాము హల్‌చల్ చేసింది. స్టీల్‌ప్లాంట్ అధికారి లింగాల రవీంద్రబాబు ఇంటి ఆవరణలో సుమారు 7 అడుగుల పాము కనిపించింది. దీంతో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్ కుమార్ సమాచారం అందించడంతో ఆయన అక్కడకు చేరుకొని నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు.

క్లుప్తంగా

నేడు పడమటమ్మ తీర్థం


కశింకోటలో వెలసిన పడమటమ్మ వారు

కశింకోట: పడమటమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఆదివారం భారీగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఇక్కడ జరిగే తీర్థాల్లో ఇదే అతి పెద్ద తీర్థం. ఈ సందర్భంగా స్థానిక కస్పావీధి ప్రాంతంలో కొలువై ఉన్న పడమటమ్మ ఆలయంలో ఉదయం నుంచి కుంకుమార్చనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన అనంతరం ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అర్జీల పరిష్కారానికి కృషి

కశింకోట: భూ వివాదాలకు సంబంధించి వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి కృషి చేస్తామని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి అన్నారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు మట్టా శ్రీను (ఫైల్)

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ అల్లు స్వామినాయుడు శనివారం తెలిపారు. ఈ నెల 13న తాళ్లపాలెం కూడలి వద్ద రోడ్డు దాటుతున్న మట్టా శ్రీను (42)ను యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడటంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో, మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న ప్రవీణ్ కుమార్

అనకాపల్లి టౌన్: స్థానిక గాంధీనగరం బీసీ హాస్టల్లో టెన్త్ విద్యార్థులకు అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ శనివారం పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

కాన్షీరాంకు ఘన నివాళి


కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ నియోజకవర్గ నేత సూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి, పెద్ద ఉద్యోగాన్ని వదిలి బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 5,310 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,730	4,390
మొదటి రకం	3,550	4,040
రెండో రకం	3,180	3,710
మూడో రకం	2,950	3,160

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	:సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్తిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

సమస్యలతో సతమతం.. క్రీడా మైదానం


నిర్లక్ష్యంగా వదిలేసిన బాస్కెట్‌బాల్ పోల్


ఎన్టీఆర్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు




నిరుపయోగంగా ఉన్న క్రీడాకారిణుల వసతి భవనం


తుప్పుపట్టి శిథిలమైన విద్యుత్ స్తంభాలు


అసంపూర్తిగా నిలిచిపోయిన బాత్‌రూమ్‌లు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఏకైక క్రీడా మైదానం, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నా, ఆ స్థాయిలో ఆటల పోటీలు జరగాలన్నా అందుబాటులో ఉన్న ఏకైక ప్రాంగణం.. ఎన్టీఆర్ క్రీడా మైదానం. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ మైదానంలో మౌలిక వసతులు కరవయ్యాయి. దీంతో క్రీడాకారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్ద హైస్కూల్ గ్రౌండ్‌గా పేరుగాంచిన ఇందులో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్ తదితర ఆటలు ఆడుతుంటారు. అలాగే ఉదయం, సాయంత్రం మహిళలు, వృద్ధులు, యువకులు రన్నింగ్, వాకింగ్ చేస్తుంటారు. వీరికి కనీసం వాకింగ్ ట్రాక్ కూడా లేదు. వర్షం వస్తే చాలు మైదానంలోకి అడుగుపెట్టడానికి కూడా వీలు పడదు. ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి పోతుంది. ప్రతిరోజూ వందలాది మంది ఈ క్రీడా మైదానానికి వస్తున్నా కనీసం తాగడానికి మంచి నీటి సౌకర్యం కూడా లేదు. అలాగే కాలకృత్యాలు తీర్చుకునే వెసులబాటు సైతం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించినా ఇక్కడి బాత్‌రూం అసంపూర్తిగానే మిగిలిపోయింది. ట్యాంక్‌కు పైకప్పు లేదు. మురుగునీటితో నిండి ఉంది. ఎన్నో విన్నపాల తర్వాత గ్రౌండ్‌లో బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేశారు. ఈ సదుపాయం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఈ కోర్టులో ఉండే పోల్‌కు ఏర్పాటు చేసిన నెట్ చిరిగి మాయమైపోయింది. కొత్త నెట్ ఏర్పాటు చేయడానికి స్వల్ప నిధులు వెచ్చిస్తే సరిపోతుంది. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదు. దీంతో నెట్ బిగించే ప్లేట్లు కూడా తుప్పు పట్టి విరిగిపోయే దశలో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో క్రీడాకారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రాంతాల నుండి క్రీడల కోసం మైదానానికి వచ్చే సమయంలో మహిళలు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దగ్గరలో ఉండేందుకు వసతి కోసం భవనం నిర్మించారు. అయితే నేటి కూటమి పాలకులు ఆ భవనాన్ని పట్టించుకోవడం మానేశారు. భవనం పరిసర ప్రాంతమంతా చెత్తా, చెదారంతో నిండి ఉంది. ఈ భవనంలో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇకనైనా పట్టణానికి ఉన్న ఏకైక క్రీడా మైదానంలో సౌకర్యాలు మెరుగుపరచాలని క్రీడాకారుల, వాకర్లు, ప్రజలు కోరుతున్నారు.

మైదానంలో సదుపాయాలు లేవు..



ఎంతో మంది వినియోగిస్తున్నా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఏటువంటి సదుపాయాలు కల్పించలేదు. నేను రోజూ వాకింగ్ చేస్తుంటాను. ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించాలి. దాంతో క్రీడాకారులు, వాకర్లు, విద్యార్థులకు వెసులుబాటుగా ఉంటుంది. – **రాయవరపు శ్రీనివాస్**, అనకాపల్లి

క్రీడా రంగానికి ప్రోత్సాహం కరవు..

క్రీడా రంగానికి ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లేదు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం. అయినప్పటికీ ఇప్పటి ప్రభుత్వం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. అలాగే వాకర్లకు ఎలాంటి సదుపాయాలు లేవు. స్టేడియంలో బాత్‌రూమ్ అసంపూర్తిగా ఉంది. క్రీడాకారుణుల వసతి గృహం కూడా పూర్తి కాలేదు. ఇప్పటికైనా మైదానంలో మంచినీటి వసతి, ఇతర సౌకర్యాలు కల్పించాలి. – **వరహాలు**, అనకాపల్లి

స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం


కశింకోటలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సుభాషిణి, రవికుమార్

కశింకోట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి అధికారులు, సిబ్బందిని కోరారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. తాళ్లపాలెం గ్రామ సభలో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను పంచాయతీ సిబ్బందికి అందించాలని ప్రజలను కోరారు. చింతలపాలెం, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ స్వచ్ఛాంధ్రపై మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, ఏపీవో ఎం. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పరీక్షలు రాయనున్న టెన్త్ విద్యార్థులు 1409 మంది

కశింకోట: మండలంలో ఈ ఏడాది 1409 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవోలు పీవీ సురేష్, కేవీఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 1288 మంది, ప్రైవేటు విద్యార్థులు 121 మంది పరీక్షలు హాజరు కానున్నారన్నారు. వీరి కోసం ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కశింకోటలోని బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, సెయింట్ జాన్స్ స్కూలు, తాళ్లపాలెంలోని జెడ్పీ హైస్కూలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, నరసింగబిల్లి, కన్నూరుపాలెం జెడ్పీ హైస్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 17న ప్రారంభమయ్యే పరీక్షలు నెలాఖరు వరకు రోజు విడిచి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయన్నారు. మొదటి రోజు ఫస్టు లాంగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీషు, 24న మ్యాథ్స్, 26న ఫిజిక్స్, 28న బయాలజీ, 31న సోషల్ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు.

తొలగిన ముసుగులు


ముసుగు తొలగిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం


ముసుగు తొలగించిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం


ముసుగు తొలగిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల దృష్ట్యా పలువురు నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు ఎట్టకేలకు 'సాక్షి' వార్తకు స్పందించి శనివారం తొలగించారు. కశింకోట పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తదితర నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించని విషయం సాక్షి పత్రికలో శనివారం 'విగ్రహాలకు ముసుగు.. అధికారులకు లొసుగు' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి వాటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరుడు


ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో ఫాల్గుణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని స్వామి వారు వజ్ర కవచాలంకృతులతో పాటు పూలు, తులసి మాలల అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. విష్ణు సహస్ర నామార్చన, అభిషేకాలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు సైకిల్ ర్యాలీ

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల చిన బాబు కాలనీ నుంచి బొజ్జన్న కొండ వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యోగా లైఫ్ ఫౌండర్ కర్ణం బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయ కృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. యోగా అభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

బాల్య వివాహాల నివారణకు కమిటీ


కొమరవోలు సచివాలయం వద్ద అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లోవరాజు

రోలుగుంట: కొమరవోలు పంచాయతీలో బాల్య వివాహాలు గుర్తించి, అరికట్టడానికి చైల్డ్ మ్యారేజీ ఫౌండేషన్ అండ్ మోనిటరింగ్ ఆధ్వర్యంలో 11 మందితో కమిటీని నిర్వాహకుడు లోవరాజు శనివారం ఏర్పాటు చేశారు. సచివాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా బడిబయట పిల్లలను గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి అందరినీ చైతన్య పరచాలన్నారు. బాలికలకు రక్షణగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 112 గురించి వివరించారు. సమావేశంలో సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రామన్, పంచాయతీ కార్యదర్శి హైమావతి, ఏఎన్ఎంలు పార్వతి రాజేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్లు కృష్ణవేణి, అనంత, జయలక్ష్మి పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

కె.కోటపాడు : వినికిడి సమస్యలతో ఇబ్బందులు పడేవారు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందాలని ఆడియాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. కె.కోటపాడులో శనివారం వినికిడి సమస్యలు గల వారికి ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందికి వినికిడి యంత్రాలు అవసరంగా గుర్తించారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరం ద్వారా ఒక్కొక్కరికీ రూ.20వేలు విలువైన వినికిడి యంత్రాలను ఆడియాలజిస్ట్ శ్రీకాంత్ అందించారు. కార్యక్రమంలో సంఘమిత్ర సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతి, మండల మురళీకృష్ణ, కన్నూరు అప్పలనాయుడు పాల్గొన్నారు.

అక్రమంగా ప్రభుత్వ స్థలాల విక్రయం


రామాపురంలో ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించిన గ్రామ కంఠ స్థలం

తుమ్మపాల: గ్రామాల్లో కూటమి నాయకులు గ్రామ కంఠ స్థలాలను కూడా వదలడం లేదు. మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల రెవెన్యూ పరిధిలో గల కొత్తూరు పంచాయతీ రామాపురం కాలనీలో సర్వే నెం. 641 గ్రామకంఠంలో ఖాళీగా ఉన్న స్థలాలపై కూటమి నాయకుల కన్ను పడటంతో లక్షల రూపాయలకు విక్రయించేస్తున్నారు. గ్రామదేవత పేరుతో అమ్మకాలు చేపట్టి నాయకులు పంచుకుంటున్నారంటు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పడిన కాలనీలో సామాజిక అవసరాల నిమిత్తం కొన్ని చోట్ల స్థలాలు కేటాయించారు. ఇవి ఖాళీగా ఉండటంతో కూటమి నాయకులు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఇటీవల కూటమి నాయకులు సుమారు రూ. 12 లక్షలకు విక్రయించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను విక్రయించేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న అతిథులు

అనకాపల్లి టౌన్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని దేవదాయ శాఖ జిల్లా ఉప కమిషనర్ ఎన్. సుజాత అన్నారు. స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ కలియుగ వేంకటేశ్వర స్వామి కల్యాణం అనంతరం అన్నదానం చేయడం వల్ల దేవాలయానికే కాకుండా ఈ ప్రాంత ప్రజలు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో టి. రాజ సులోచన, ప్రధాన అర్చకులు పుల ఖండం గిరిబాబు, ధర్మకర్తలు గోలి మురళి, సీహెచ్ నూకరాజు, వేదుల సుర్యప్రభ, కొణతాల అరుణ, నిమ్మకాయల తులసి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత


చోడవరంలో మానవహారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు

చోడవరం: ప్లాస్టిక్ నియంత్రణపై అందరూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని కోరుతూ చోడవరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా అందరూ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో సీఐ అప్పలరాజు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ ఈఓ నారాయణరావు, టౌన్ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటఅప్పారావు, గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, చైర్మన్ సత్తిబాబు పాల్గొన్నారు. గోవాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా


దుకాణాల ఎదుట చెత్తను తొలగింపజేస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

దేవరాపల్లి : రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తాచెదారం వేస్తే సదరు షాపు యజమానులకు జరిమానా విధిస్తామని డీఎల్‌డీవో మంజులవాణి అన్నారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరాపల్లిలో ఎంపీడీవో సువర్ణరాజు, ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. మెయిన్ రోడ్లలో దుకాణాలను, కాయగూరల మార్కెట్‌ను సందర్శించి పరిశుభ్రత పాటించని షాపు యజమానులకు హెచ్చరికలు చేశారు. ప్రతి దుకాణదారు విధిగా చెత్త డబ్బాలను ఉంచాలని సూచించారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఏపీఎం ఎస్.ప్రభాకర్, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు. బోయిలకింతాడలో సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, గ్రామస్తులు, పారిశుధ్య సిబ్బందితో కలసి చెత్తాచెదారాలను, డ్రైనేజీల్లో పూడికలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై కళాజాత


సారా నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, సర్పంచ్ గంగరాజు తదితరులు

నాతవరం : నాటు సారా తాగడం వల్ల ఆరోగ్యాన్ని చేజేతులా నాశనం చేసుకోవడం జరుగుతుందని గొలుగొండ ఎక్సైజ్ ఎస్ఐ ఎస్.కె.రహీం అన్నారు. సరుగుడు గ్రామంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గొల్లపల్లి గంగరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సారా నిర్మూలనపై కళాజాత నిర్వహించి ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ రహీమ్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి నాటుసారా నిర్మూలించేందుకు అంతా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించగగా, ఆయా గ్రామాల్లో చాలా వరకు సారా తయారీ, విక్రయాలు తగ్గాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇంకా ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

నిర్వాసిత రైతుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

అచ్యుతాపురం రూరల్: రావిపాలెం గ్రామ నిర్వాసిత రైతుల సమస్యలపై అధికారులు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలను జెడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ ఖండించారు. శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో ఆయన బార్క్ రావిపాలెం గ్రామ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. యలమంచిలి మాజీ శాసన సభ్యుడు కన్నబాబు రాజు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాకే భూ-సేకరణ గురించి ఆలోచించాలన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 5 సెంట్ల భూమి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.